క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



కాటారం: మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. మండల కేంద్రంలో సబ్దార్, దుర్గయ్య, సత్యనారాయణ కుటుంబాలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని సూచించారు. మంత్రి వెంట మండల పార్టీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సమ్మయ్య,మహిళా అధ్యక్షురాలు మహేశ్వరీ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేశ్



చిట్యాల : బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన పిట్ట సురేశ్‌ను నియమిస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి నియామక పత్రాన్ని అందించగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందుకున్నాడు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ నాకు మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించిన గండ్ర దంపతులకు, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్, యూత్ నాయకులు తొటం నవీన్ , మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, నాయకులు దామెర రాజు, శ్రీనివాస్, నాగరాజు లు పాల్గొన్నారు.

టీఆర్పీఎస్ మండల అధ్యక్షుడిగా ప్రసాద్



మల్హర్ : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టీఆర్పీఎస్) మండల అధ్యక్షుడిగా మండల కేంద్రం తాడిచర్ల గ్రామానికి చెందిన జల్లా రపు ప్రసాద్ నియమితులయ్యారు. సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ప్రసాద్‌ను మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ నాయకులకు ప్రసాద్ కృజ్ఞతలు తెలిపారు.

మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలి

కాటారం : మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ ఆంగోతు సుగుణ, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆదివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కాళేశ్వరం పర్యటనకు వచ్చిన మంత్రిని కాటారంలో కాంగ్రెస్ నాయకులు కలిసి స్వాగతం పలికారు. ఐదు మండలాలకు కూడలిగా ఉన్న కాటారం సబ్‌డివిజన్ కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిట్యాల : మండలంలోని నవాబుపేట గ్రామ శివారులో పక్కా సమాచారం మేరకు పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నవా బుపేట శివారులో ఆరుగురు పేకాట ఆడుతుండగా నలుగురిని అదుపులోకి తీసుకోగా మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. చిలుముల రాజేష్, ఈసంపల్లి కుమార్, ఉయ్యాల రమేష్, చెక్క సాంబయ్యలు ఉండగా పరారీలో వలబోజుల నరేష్, ఈసంపల్లి రాజేశ్వర్‌రావులు ఉన్నారు.

ఇద్దరికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: ఇద్దరు పరిశోధకులకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏ స్టడీ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇట్స్ రికమెండేషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పొలిటికల్ సైన్స్ వి భాగం పరిశోధకుడు అదె మల్లేశానికి డాక్టరేట్ ప్ర దానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్ దినేష్‌కుమార్ పర్యవేక్షణలో మల్లేశం తన పీహెచ్‌డీని పూర్తిచేశారు. ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు పి.నాగచందర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ట్రిస్ట్ విత్, ఏ స్టడీ ఆఫ్ నాయిపాల్స్ ఇండియా ట్రావెలాగ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి నాగచందర్ డాక్టరేట్ అందజేశారు.

50 ఏళ్ల చరిత్రకు చెదలు

- మూతబడిన శివాలయం
- ఉత్సవ కల్యాణంతోనే సరి
- పట్టించుకోని దేవాదాయ శాఖ



మూతపడిన శివాలయం

వాజేడు : కష్టమొస్తే దేవుడా నన్ను కాపాడమంటూ భక్తులు మొక్కుతుంటారు. అలాంటి దేవుడికే కష్టమొస్తే తానేం చేస్తాడు. ఎవరికి చెప్పుకుంటాడు. ఇక్కడ అదే జరిగింది. 50 ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయాన్ని మూసివేయడంతో ఆలయ ప్రాధాన్యం దెబ్బతింది. మండల కేంద్రంలోని శివాలయాన్ని అనివార్య కారణాలతో మూసివేశారు. దీంతో శివరాత్రి ఉత్సవాలకు నోచుకోవడం లేదు. కేవలం పక్క గ్రామంలో జరుగుతున్న ఉత్సవ కల్యాణానికి భక్తులు వెళ్లాల్సి వస్తుంది. మండల కేంద్రంలో 1976లో శివాలయాన్ని నిర్మించారు. ప్రతీ ఏడాది జరిగే శివపార్వతుల కల్యాణానికి వాజేడు, వెంకటాపురం, చర్ల మండలాలతో పాటు గోదావరి అవతలివైపున ఉన్న గ్రామాలతో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చేవారు. సొంత ఖర్చులతో అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణాన్ని గుడి ధర్మకర్త అయిన కాకర్లపూడి వీరభద్రరాజు జరిపించే వారు. భక్తులకు కాలక్షేపం కోసం హరికథ, బుర్రకథ, బ్లాక్ అండ్ వైట్ సినిమాలు ప్రదర్శింప చేసేవారు. దీంతో భక్తులు తెల్లవార్లు అక్కడే జాగారం చేసే వారు. అలాంటిది ఆయన చనిపోయిన తర్వాత ఆలయంలో జరిగిన దొంగతనంలో శివపార్వతులకు సంబంధించి కొన్ని ఆభరణాలు దొంగి లించబడ్డాయి. గుడిలో చోరీ జరగడం అరిష్టగా భావించి శాస్త్రోక్తంగా యాగాలు, హోమాలు జరిపించి గుడిని మూసివేశారు. దీంతో గుడికి వెళ్లి స్వామివారిని దర్శించు కోవాలనుకునే వారికి ఆ అవకాశం లేకుండా పోయింది.

పట్టించుకోని దేవాదాయ శాఖ

వాజేడులోని శివాలయానికి ఎంతో పేరు ఉన్నప్పటికీ ఈ దేవాలయం విషయంలో దేవాదాయ శాఖ ఏ మాత్రం పట్టించుకోలేదు. దేవాదాయ శాఖ నుంచి పలుమార్లు అధికారులు ఆలయాన్ని పరిశీలించి వెళ్లారు. ఆ సమయంలో శివాలయం తెరుస్తారని శివపార్వతులకు పూజలు చేయవచ్చని భక్తులు భావించినప్పటికి నిరాశే ఎదురైంది.



ఆలయంలోని నవగ్రహాలు



వెనుక వైపు నుంచి శివాలయం

ఉత్సవ కల్యాణంతోనే సరి

50 ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం మూతపడటంతో మండల కేంద్రంలో శివరాత్రి ఉత్సవాలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సమీపంలోని జంగాల పల్లి గ్రామస్తులు ఉమారామలింగేశ్వరస్వామి ఉత్సవ కల్యాణాన్ని ప్రతీ ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంతో వాజేడు, నాగారం, జంగాలపల్లి గ్రామాలకు చెందిన భక్తులు ఆ ఒక్క రోజు కల్యాణానికి వెళ్లి వస్తున్నారు. అదే శివాలయం ఉంటే 5 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో స్వామి వారిని కొలిచే అవకాశం ఉండేది కదా అంటూ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖాధికారులు, మంత్రి దృష్టిని కేంద్రీకరించి వాజేడులోని చరిత్ర కలిగిన శివాలయాన్ని తెరిపించాలని కోరుతున్నారు.

చిట్టడవుల్లా ఎస్సారెస్పీ కాల్వలు

- పూడికతో నిండిన పిచ్చిమొక్కలు
- ఆయకట్టుకు అందని నీరు
- మరమ్మతులు చేయాలంటున్న రైతులు



బంగ్లాపల్లి రోడ్డులో పిచ్చి మొక్కలతో కాల్వ

మొగుళ్లపల్లి : సాగునీటి కాలువలన్నీ చిట్టడవులను తలపిస్తున్నాయి. కాల్వలకు మరమ్మతులు లేకపోవడంతో పూడుకపోతున్నాయి. కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగి పూడికతో నిండిపోవడంతో కాల్వలు ఆనవాళ్లను కోల్పోతున్నాయి. రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో 25 ఏళ్ల క్రితం మండలంలో నిర్మించిన ఎస్సారెస్పీ కాల్వలు అలంకార ప్రాయంగా మారాయి. 8 ఏళ్ల క్రితం వరకు వాటి మరమ్మతులకు లక్షలు వెచ్చించినప్పటికీ చివరి ఆయకట్టుకు చుక్క నీరు కూడా చేరలేదు. ఫలితంగా రైతన్నలకు కన్నీరే మిగిలింది.

మండలంలో డీబీఎం–31, డీబీఎం–18 కాల్వలు 25 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ కాల్వల ఆయకట్టు క్రింద సుమారు 3 వేల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా ఒక ఎకరానికి కూడా కాల్వ నీరు అందిన పరిస్థితి లేదు. కాల్వల మరమ్మతుకు ప్రభుత్వం ఏటా లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని రైతులు ఆరోపిస్తునారు.

మండలంలోని డీబీఎం–31 కాల్వ మరమ్మతులకు లక్షలు వెచ్చించినా కాల్వల్లోకి చుక్క నీరు కూడా రాకపోవడంతో నిధులు వృథా అయ్యాయి. అంతేకాకుండా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మెయిన్ కాల్వకు గండ్లు వేస్తూ సమీప చెరువులు, కుంటలను నింపుతున్నారు. దీంతో కాల్వ కింది ప్రాంతాల్లో పంటలు పండించే రైతులకు నీరు అందడం లేదు. ప్రభుత్వం స్పందించి కాల్వల ద్వారా నీరు అందజేసే విధంగా చుడాలని రైతులు కోరుతున్నారు.

అలంకార ప్రాయంగా కాల్వలు



నీటిని కాల్వల ద్వారా అందించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఐదేళ్ల నుంచి కాల్వలను పట్టించుకున్న వారే లేరు. దీంతో కాల్వలు అలంకార ప్రాయంగా మారాయి.

– పడిదల నర్సింగరావు, రైతు మొగుళ్లపల్లి

అధికారులు చర్య తీసుకోవాలి



ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీరందించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి. డీబీఎం– 31 కాల్వలో చెత్త పేరుకుపోయి పిచ్చిమొక్కలు పెరిగాయి. చివరి ఆయకట్టు వరకు నీరందించాలి.

– తిప్పారపు సురేందర్, రైతు మొగుళ్లపల్లి


లబ్ధిదారుల వివరాలు నమోదు



శాయంపేట : ఇటీవల చేపట్టిన ప్రజాపాలన, గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాను డేటా ఎంట్రీ చేస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. రేషన్ డీలర్లు తమ షాపు పరిధికి వచ్చే లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి షాపు నంబర్లు నమోదు చేసినట్లు చెప్పారు. డేటా ఎంట్రీ పూర్తిచేసిన అనంతరం సివిల్ సప్లయ్ కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ ప్రభావతి, ఆర్ఐలు రమేశ్‌ఖన్నా, రమేశ్, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టవర్లు ఉన్నట్టా.. లేనట్టా...?

- సిగ్నల్ లేక బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



అందుకుతండాలో నిర్మించిన బీఎస్ఎన్ఎల్ టవర్

చిట్యాల : మండలంలోని అందుకుతండ, వెంచరామి, వరికోల్‌పల్లి గ్రామాల్లో ఐదు నెలల క్రితం బీఎస్ఎన్ఎల్ టవర్లను పూర్తి స్థాయిలో అధికారుల నిర్మించారు. కానీ టవర్లు సక్రమంగా లేక సిగ్నల్స్ రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు మెరుగైన నెట్ సేవలు అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఆయా గ్రామాల్లో కొట్లాది రూపాయలు వెచ్చించి టవర్లను నిర్మించినా కూడా సక్రమంగా సిగ్నల్స్ రాక అనేక అవస్థలు పడుతున్నారు. గతంలో వినియోగదారులు వివిధ కంపెనీలకు సంబంధించిన సిమ్‌లను వాడుకునేవారు. ఈ క్రమంలో గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మించగానే వినియోగదారుల సంతోషంగా బీఎస్ఎన్ఎల్‌కు మారారు. కానీ వారి ఆశలు నిరాశగా మారాయి. కొంత కాలం నుంచి సంబంధిత అధికారులకు తెలిపినా కనీసం ఎవరూ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మారుమూల గ్రామాల్లోని ప్రజలకు బీఎస్ఎన్ఎల్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

శాయంపేట : ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరామచంద్ర మిషన్ ద్వారా హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు మూడు రోజుల పాటు నవోదయ ఉన్నత పాఠశాలలో ధ్యాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ధ్యాన శిబిరానికి అధిక సంఖ్యలో పాల్గొని పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని అన్నారు. ధ్యాన శిబిరాన్ని ఉచితంగా ఏర్పాటు చేస్తున్న నవోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మామిడి పద్వీకి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శారద, ట్రైనర్ నీరజ, అభ్యాసకులు జనార్ధన్, శాగంటి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని శివాపురం గ్రామంలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి గంగమ్మ తల్లి నూతన దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవ పూజ కార్యక్రమాలు ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు, పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్, మాజీ సర్పంచ్ చేల వినయ్‌కుమార్, శివాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీరాములు, శ్రీరాములు రేగా నర్సక్క, గద్ద రాజు యాదవ్, మెట్టు రంజిత్ యాదవ్, కానబోయిన సాంబరాజు, భరత్, భాషబోయిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న డ్రైవర్ మృతి

మంగపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఎస్డీ గౌసుద్దీన్ ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. జనవరి 26న కమలాపురంలోని కొందరు రైతులకు చెందిన మిర్చిని తన టాటాఏస్ ట్రాలీ ఆటోలో హుజూరాబాద్‌లోని మార్కెట్‌కు తరలిస్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తన రెండు కాళ్లు విరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రున్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. 22 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గౌసుద్దీన్‌ను ఆదివారం మృతి చెందాడు.

భూపాలపల్లిలో యువకుడు..

భూపాలపల్లి అర్బన్ : జిల్లా కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో రెండు రోజుల క్రితం పమ్మి నవీన్‌కుమార్(27) డ్రైవర్ రెండు రోజుల క్రితం పురుగుల మంది తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి సొంత గ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంటూరు జిల్లా గుంటూరు మండలం పందిరిపాలెం గ్రామం కాగా ఉపాధి నిమిత్తం గత కొన్నేళ్లుగా తన కుటుంబం పట్టణంలోని ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తూ జవహర్‌నగర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉంది. ఈ విషయంపై స్థానిక సీఐ నరేష్‌కుమార్‌ను సంప్రదించగా చికిత్స పొందుతు నవీన్‌కుమార్ మృతి చెందిన విషయం నిజమేనని, ఇంకా బాధిత కుటుంబ సభ్యులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

శిక్షణకు వెళ్లిన హెచ్‌ఎంకు అస్వస్థత



ఏటూరునాగారం: స్థానిక సంస్థల ఎన్నికల విధుల కోసం చేపట్టిన ఒకరోజు శిక్షణకు వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన కన్నాయిగూడెం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తుపాకులగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం కోర్నీబెల్లి రాఘవరావు ఈనెల 3న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల శిక్షణలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని తెలిపారు. వెంటనే ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించామన్నారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్ కుమార్ కోరారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

కాటారం: శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నేతృత్వంలో మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం ఫంక్షన్ హాల్‌లో నేడు (సోమవారం) నుంచి ఉచిత యోగ, ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ చెరుకుపల్లి రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11, 12 తేదీల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులని, యోగా, ధ్యానం ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సెంటర్ కోఆర్డినేటర్ చెరుకుపల్లి మాధవి, నోడల్ కోఆర్డినేటర్ బొంగాని లక్ష్మణ్, సాధకులు మాధవరెడ్డి, విష్ణు, నాగరాజు, సమ్మయ్య, రమాదేవి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్‌లతో గీతన్నలకు రక్షణ

- జిల్లాలో 300 మందికి పంపిణీ



కాటమయ్య రక్షణ కిట్‌లను అందజేస్తున్న బీసీ సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి(ఫైల్)

ఏటూరునాగారం: నిత్యం ఆకాశానికి హద్దుగా ఉండే తాటిచెట్లను ఎక్కుతున్న కల్లు గీత కార్మికులకు కాటమయ్య కిట్‌లు రక్షణగా నిలుస్తున్నాయి. కుల వృత్తిలో భాగమైన కార్మికులు తాటికల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి మరణించిన సంఘటనలు, కాళ్లు, చేతులు విరిగిపోయి మంచాన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వీటిని నివారించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమశాఖ ద్వారా కాటమయ్య రక్షణ కిట్‌లను ఉచితంగా అందజేస్తున్నారు. అయితే ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం తన తండ్రి గీతకార్మికుడు కావడంతో అతడు చెట్టుపై నుంచి పడి మరణించడంతో దీనిపై అధికారి రీసెర్చ్ చేసి నూతనంగా ఈ రక్షణ కిట్‌ను తయారు చేయించారు. ఈ కిట్‌ను ప్రత్యేకంగా రూ.12 వేలతో ప్రభుత్వమే తయారు చెల్లించి గీత కార్మికుడికి అందజేస్తోంది.

ఎలా పనిచేస్తోంది అంటే

గీతకార్మికుడికి ఉన్న మోకు ఈ సేఫ్టీబెల్ట్‌ను అమర్చుతారు. తర్వాత తాటిచెట్టుకు క్లిప్స్ అమర్చి పైకి వెళ్తారు. ప్రమాదవశాత్తు మోకు జారిపోతే తాటిచెట్టుకు అమర్చిన సేఫ్టిబెల్ట్ కార్మికుడిని జారిపోకుండా గట్టిగా పట్టుకుంటుంది. దీంతో ఎలాంటి ప్రమాదం జరగదు. దీంతో గీత కార్మికుల కుటుంబాలకు రక్షణగా నిలుస్తోంది.

300 మంది కార్మికులకు సేఫ్టిబెల్ట్స్

జిల్లాలో ఏటూరునాగారం, ములుగు సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ ప్రొబెషనరీ స్టేషన్లు ఉన్నాయి. ములుగు ఎక్సైజ్ సర్కిల్ కింద ములుగు, వెంకటాపురం(ఎం), గోవిందరావుపేట, తాడ్వాయి మండలాలకు గాను 240 కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. అలాగే ఏటూరునాగారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ కింద ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(కె) మండలాలు ఉండడంతో ఈ పరిధిలోని 60 మంది గీత కార్మికులకు సేఫ్టి బెల్ట్‌ను అందజేశారు. వీరికి ఎలా ఉపయోగించాలని ప్రతి కార్మికుడికి శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు వాటిని వినియోగించడంపై గీత కార్మికులు మొగ్గు చూపుతున్నారు.

కార్మికుడికి భరోసా



కాటమయ్య సేఫ్టి బెల్ట్స్ తో గీత కార్మికులకు భరోసానిస్తోంది. వృత్తిరీత్యా ప్రమాదం అయినా కల్లు గీయక తప్పదు. తాటిచెట్టు ఎక్కి ఎంతోమంది ప్రాణాలను కో ల్పోయారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కిట్స్‌ను ఉచితంగా పంపిణీ చేస్తోంది.

– బూర శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు, ములుగు

ఎంతో ఉపయోగం



కాటమయ్య రక్షణ కిట్స్‌తో ఎంతో ఉపయోగం ఉంది. అది ధరించి తాటిచెట్టు ఎక్కితే ప్రమాదవశాత్తు మోకు జారినప్పటికీ ఆ సేఫ్టిబెల్ట్‌పై ఆధారంగా ఉండవచ్చు. దీంతో కిందపడకుండా నిలువరిస్తోంది. ఈ కిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– గద్దం సంతోష్, ఏటూరునాగారం, కల్లు గీత కార్మికుడు

ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కాటమయ్య రక్షణ కిట్స్‌ను గీత కార్మికులకు ఇస్తోంది. జిల్లాలోని రెండు ప్రొబెషనరీ స్టేషన్ల ద్వారా రికార్డుల్లో నమోదైన కార్మికులకు అందించడం జరుగుతుంది. దీంతో ప్రమాదాల నివారణ చేయవచ్చు. ప్రతి ఒక్కరూ ఈ సేఫ్టి బెల్ట్‌ను ఉపయోగించాలి.

– రవీందర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి, ములుగు

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న తిరుపతిరావు

మొగుళ్లపల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులను గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు బలుగూరి తిరుపతి రావు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని అకినపల్లి గ్రామంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికలకు బీఆర్ఎస్ కార్యకర్తలు సమాయత్తం కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడారి రమేశ్, జిల్లా, మండల నాయకులు బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.